మార్పు

శ్రీమతి వెంపాటి జానకీదేవిగారు

సాయంత్రము పుష్పలత వంటఇల్లు ఊడ్చి ముడికట్టుకోడానికి ప్రయత్నం చేస్తూవున్నది చీకటిపడితే పిల్లలు హడావిడిచేసి ఆకలికి ఏడుస్తారని. ఇది అంతా చూసింది లీలావతి. ఇహ కోపంపట్టలేక పిల్లలమీద పెట్టి ఆరంభించింది. "మీకు ఎంతతిన్నా కంటఇంటిమీదే ఉంటాయి ప్రాణాలు. సాయంత్రం అయిదుగంటలైనా కొట్టనివ్వరు సరిగదా, అన్నం దగ్గరకు రాగానే వాదూమీదూ కలిపి పోట్లాడడం. ఏదైనా చెప్పితే తప్పు ఎట్లాగో ఈకాపురం చెయ్యడం. నాకు మీవల్ల చావువచ్చింది." అని బిగ్గరగా ఇంట్లో మొగవాళ్లు వినేటట్టు ప్రారంభించింది సాధింపు. ఇదంతా అర్థంచేసుకొని పుష్పలత ఖిన్నురాలై ఏమీమాట్లాడకుండా తన పని చేసుకుంటూ వున్నది అవతల తనమాట భర్త వింటే ఏమిఅనుకుంటాడోనని. రెండుచేతులు కలిస్తే చప్పట్లుగాని ఒక చెయ్యి ఎంతసేపు కొట్టుకుంటుంది. కొట్టుకుంటే మాత్రం ప్రయోజనంఏమి అన్నట్లు వాగివాగి నోరునొప్పి ఎత్తడం చేతనో, లేక, ఇంకా తను మాట్లాడడం నిష్ప్రయోజనమనో సాధింపు ఆపివేసి భర్తరాకకు ఎదురు చూస్తూవున్నది లీలావతి.

సావిట్లో కుర్చీలోకూర్చుని చదువుకుంటూవున్న పుష్పలతభర్త లక్ష్మణరావు వదినెగారి సాధింపు లన్నీవిన్నాడు. తన భార్యనీ, తన పిల్లలనీ ఆవిడసాధించే ఎత్తిపొడుపులకు దేనికీ తన భార్య జవాబు చెప్పక పోవడానికి తన మనస్సులో చాలా సంతోషించినాడు. కాని అతని మనస్సు విచారంలో మునిగింది. చదివే పుస్తకంమూసి దీర్ఘాలోచన చేశాడు. ఎన్నాళ్లు తనూ, తన పిల్లలూ, భార్యా వదినెగారి మాటలు పడుతూ వుండడం. పోనీ ఆవిడ అభిప్రాయాన్ని బట్టి వేరే ఉందామనుకున్నా అన్నగారిని చూసి వూరుకోవడం అవుతోంది. ఈ సంవత్సరమేనా ఏమ్మే ప్యాసయి ఏవూరిలోనేనా హెడ్‌మాస్టరుగా ప్రవేశించితే విడిపడకుండా వేరే వుండడం అవుతుంది. ఎట్లాగైనా ప్యాసుఅవడానికి ప్రయత్నంచేసి చదవాలి. చదువుదామన్నా ఇంట్లో తెల్లవారింది మొదలు ఈ మాటలవల్ల చదువు సాగడంలేదు ఎట్లాగా? అని ఆలోచిస్తూ వున్నాడు. పోనీ విడిగావుండడానికి తన భార్యతో చెప్పితే ఆవిడ ఏమంటుందో ఆవిడ అభిప్రాయం కనుక్కుందామని ఉద్దేశ్యం కలిగింది. వెంటనే కుర్చీలోనుంచి లేచి వంటఇంట్లోకి వెళ్లేడు. పుష్పలత ముడికట్టుకొని పొయ్యిమీద బియ్యంపెట్టి చంద్రముఖిని ఎత్తుకొని ఆడిస్తోంది. పుష్పలతకి ఇద్దరు పిల్లలు. పిల్లవాడికి అయిదేండ్లు. పేరు సుందరం. పిల్లకి ఏడాది, ఆ పిల్ల పేరే చంద్రముఖి. పేరుకు తగ్గట్టుగా వుంటుంది. ఆ పిల్ల మొహం, కళ్లు, ముక్కు ఎంత పిల్లలయందు అసహ్యం గలిగిన వారికైనా ఆ పిల్లని చూస్తే ఎత్తుకోవలెనని బుద్ధిపుడుతుంది. పిల్ల ఏడాదిదైనా తెలివితేటలు అద్భుతంగా వున్నవి. పువ్వుపుట్టగానే పరిమళం యిస్తుంది అన్నట్టు, చిన్నతనంలోనే తెలుస్తాయి తెలివితేటలు. అట్లా లక్ష్మణరావు వంటఇంట్లోకి వెళ్లి భార్యతో—

"పుష్పలతా, ఏంచేస్తున్నావు?" అన్నాడు.

"మడికట్టుకుని వంటచేస్తూన్నాను, మీకు ఏమికావాలి?" అన్నది.

"అబ్బే, ఏమీ వద్దుకాని నీతో ఒక సంగతి చెపుదామని వచ్చేను."

"ఏమిటా సంగతి?"

"ఏమిటా? ఇందాక మా వదినె అన్నమాటలు అన్నీ విన్నావా?"

"విన్నాను" అన్నది.

"అయితే నీ ఉద్దేశ్యం ఏమిటి?" అన్నాడు.

"ఏమీలేదు. నేను జన్మించిన వేళావిశేషము."

"నీవు జన్మించిన వేళావిశేషం యిట్లావున్నదని అనుకోవడం ఎందుకు? యిటువంటి భర్తని చేసుకోడం వల్లగదా యిట్లా కష్టపడవలసివచ్చింది, వేరే ఎవరినేనా చేసుకుంటే సుఖపడుదువుగదా."

"ఛా, ఏమిమాటలు? నానీతలో సుఖపడడం లేకపోతే ఎవరు ఏమిచేస్తారు?" అన్నది విచారంతో.

"పోనీ, రేపు మా అన్నగారితో చెప్పి విడిపడదామా?" అన్నాడు మెల్లిగా.

"ఏమని చెపుతారు?"

"ఇంట్లో ఆడవాళ్లకీ ఆడవాళ్లకీ సరిపడడం లేదు. రోజూ వదినె పిల్లిమీద పెట్టి, ఎలుకమీద పెట్టి సాధిస్తోంది గనుక, మేము సర్దుకుంటాము." అని.

"అట్లా మీరు చెపితే మీవదినెగారిమీద నేరంచెప్పినట్లు అవుతుంది. దానిమీద ఆయనకి కోపంవస్తుంది. నా భార్య అంటే నీ భార్య పూరుకుందా, నీభార్య ఏమిఅంటే నాభార్యఅన్నదో, అంటారుగాని తన భార్య మీద తప్పువున్నదని అనుకోరు. మీరు చెప్పడంవల్ల అల్లరిగాని మరిఏమీ లేదు. ఎందుకు వచ్చిన అల్లరి యిదంతాను? నలుగురూ వింటే ఫలానాఆయనతమ్ముడు విడిబడ్డాడమ్మా అంటారు. నలుగురి నోళ్లల్లో పడడం ఎందుకు? ఎల్లాగో కొన్నాళ్లు కాలంజరిపితే ఈ లోపున మీరు పరీక్ష ప్యాసయి ఎక్కడేనా ఉద్యోగంలో ప్రవేశించితే ఎట్లాగూ వెళ్లుతాము. ఈలోపల తొందరపడడం ఎందుకు? అన్నిట్లోకి నిదానం మంచిది అంటారు పెద్దలు. పెద్దవాళ్ల మాటమీదే వుందాం కొన్నాళ్లు." అన్నది.

ఏమో ఆలోచిస్తూ సరే అంటూ ఏదో చెప్పబోతున్నాడు. యింతట్లోకే పిల్లలు అన్నానికి రావడం చేత పుష్పలత పిల్లలకి అన్నంపెట్ట ప్రయత్నానికి వెళ్లింది. లక్ష్మణరావుకూడా చదువుకోడానికి సావిట్లోకి వెళ్లినాడు.

ఏడుగంటలకి ఆఫీసునుంచి శివరావు ఇంటికి వచ్చినాడు. శివరావు అంటే లీలావతి భర్త. అతను పగలు పదిగంటలకి ఆఫీసుకు వెళ్లితే రాత్రిఏడుగంటలకి యింటికి వస్తాడు. అంతవరకూ ఆఫీసులో పని సరిపోతూ వుంటుంది. అతను ఎమ్మే ప్యాసయినా ఈ కాలంలో బ్రాహ్మణులకు ఎక్కడా ఉద్యోగాలు దొరక్కపోవడంచేత ఉద్యోగం పురుషలక్షణం అని ఏదో ఆఫీసులో నెలకి రొండవై రూపాయలకి ప్రవేశించినాడు. ఆ సిమంతులు గనుక ఏమీ యిబ్బందిలేకుండా బండిసాగుతోంది. ఇతనికి ముగ్గురు పిల్లలు. లీలావతి కనీపెంచుతూన్నదే యింకా.

అతను రాగానే స్నానంచేసి అతనూ లక్ష్మణరావు భోజనానికి కూర్చున్నారు. వాళ్లతోపాటే లీలావతికూడా భోజనంచేసి తిన్న విస్తరేనా ఎత్తకుండా లేచి వెళ్లింది. తర్వాత పుష్పలత భోజనంచేసి అంతా చేసుకుని తలుపులు వేసుకుని పడుకోడానికి వెళ్లింది. లీలావతి గదిలో శివరావుతో ఘోష మొదలుపెట్టింది. ఇంట్లో చాకిరీఅంతా తను చెయ్యలేకుండా వున్నాననీ, ఎంతచేసినా ఇంట్లో ఎవరికీ మెప్పులేకుండా వున్నదనీ, ఎన్నాళ్లు ఇట్లా తానుమాత్రం చెయ్య గలుగుతాననీ, తోడికోడలు ఆయన వున్నంతసేపు పనిచేసినట్లు నటించి, ఆయన వెళ్లగానే గదిలో ప్రవేశించి సాయంత్రము వరకూ బయటికే రాదనీ ఏమేమో [illegible]లు పెట్టింది. ఆయన పైకి ఏమీ మాట్లాడలేదుగాని కోపంవచ్చినట్లు తెల్లవారి ధుమధుమను బట్టి స్పష్టమైంది. దానికితోడు పుష్పలత ఆరోజున నిద్ర లేచేటప్పటికి ప్రొద్దెక్కింది రాత్రి పిల్ల నిద్రపోకుండా ఏడ్వడంచేత. ఈవిధ

ప్రొద్దెక్కి లేవడం చూడడంతోనే శివరావుకి అగ్నిలో ఆజ్యంపోసినట్టు అయినది. దానితో ఆయన తమ్ముడి దగ్గిరకు వెళ్ళి కాస్సేపు హడావిడి చేసినాడు. అన్న మనసు తెలిసినవాడు గనుక తమ్ముడు మాట్లాడకుండా వూరుకున్నాడు. శివరావుకు కోపంవచ్చినా సంతోషంవచ్చినా వెనకా ముందూ తెలియదు. ఎవరు ఏమి చెప్పినా వినడు. తను ఏది అనుకుంటే అది అని తీరవలసినదే. అటువంటప్పుడు తక్కినవాళ్లు వూరుకోడం వుత్తమం. పుష్పలత ప్రొద్దెక్కి లేచినదన్న మాటేగాని పనిఅంతా తానే చేసుకుంది. లీలావతికి ఆరోగ్యం అక్కరలేదు. మాటలు చెప్పేవారు పనిచెయ్యలేరు పనిచేసేవారు మాటలు చెప్పలేరు అన్నసామెత వట్టిదా?

మధ్యాహ్నం లీలావతి సావిట్లో చాపమీద కూర్చుంది. పుష్పలత అప్పుడే ఏదో పనివుండగా గది లోకి వెళ్ళింది. సమయం కనిపెట్టినట్లు అప్పుడే పొరుగు యింటి శాంతమ్మవచ్చి లీలావతితో లోకాభిరామా యణం మాట్లాడుతోంది. అది అయిన తర్వాత—

“మఱదలా! మీ తోడికోడలు ఎక్కడా బయట కనపడదు సరిగదా, యింటికి వచ్చినా కనపడ దేమమ్మా?” అన్నది.

“వదినా! ఆవిడ గదిలోనుంచి బయటికివస్తేగా? ఎవరికేనా కనపడ్డానికి. అందరి బదులూ నేను కనప డుతూ వున్నాగా. ఆవిక అట్లా కనపడదు. నీకు చూడవలెనని వుంటే గదిలోకి వెళ్ళిచూడు.” అన్నది.

“సరే వెళ్లిచూస్తా” అంటూ లేవబోతూ వుండగా శాంతమ్మకి ఇంట్లోనుంచి కబురు వచ్చింది ఇంటికి ఎవరో వచ్చినారు త్వరగా రమ్మని.

“సరే, ఇంకోసారి వచ్చి మీ తోడికోడలిని చూస్తాను.” అని శాంతమ్మ ఇంటికి వెళ్లినది.

లక్ష్మణరావు ఎమ్మే ప్యాసయినాడు. వెంటనే ఏలూరు స్కూల్లో ఖాళీవచ్చినదంటే దరఖాస్తు పెట్టి ప్రవేశించినాడు. నెలకి నూటయాభై యిస్తారు జీతం. మెల్లగా అక్కడ ఇల్లు కుదుర్చుకుని భార్యనీ, పిల్లలనీ పిల్చుకుని వెళ్లి అక్కడ మకాం పెట్టినాడు. అప్పుడు అతని మనస్సుకు నూతనవికాసం కలిగింది. తను అనుకున్నవి అన్నీ సఫలం అయినవి కదా అని సంతోషం. ఎప్పుడేనా పండుగలకి, లేక శెలవులకి ఇంటికి వెళ్లేవారు. ఒకప్పుడు మంచిదిగాని పుష్పలత యిప్పుడు లీలావతికి చాలామంచిదైనది. ఎవరితోనేనా చెప్పే టప్పుడు మా పుష్పలత అంత మంచి మనిషి ఎవ్వరూ లేరని చెపుతుంది. ఏ పండుగవచ్చినా పుష్పలత, లక్ష్మణ రావు ఏలూరునుంచి రావలసినదే. అట్లా అన్యోన్యం కుదిరింది యూశారా చివరికి. బంధువులకు దూరంగానూ, నీళ్లకు దగ్గరగానూ ఉండమంటారు యిందుకే కాబోలు?

చివరచివరకు లీలావతి, శివరావులకు లక్ష్మణరావు, పుష్పలతల సుగుణములు, సౌహార్ద్రత బాగా తెలిసివచ్చినాయి. వారు చేసే ప్రతికార్యంలోనూ వీరి సలహా, సహాయం కోరేవారు. లీలావతి పూర్వ వర్తనంతా మారింది. మఱది, తోడికోడలంటే అమిత ఆనందం, ఆదరణ, గౌరవం. వారు వచ్చి తమ దగ్గిరఉంటే బాగుండును అనుకొంటుంది అప్పుడప్పుడు. కాని అదెట్లా వీలుపడుతుంది యిప్పుడు.

అతడు ఇల్లాలక్ష్మణరావు కాఫీ తాగుతున్నాడు. చంద్రముఖి నవ్వుతూ ప్రక్కన ఆడుకుంటోంది. పుష్పలత వైపు తిరిగిఅన్నాడు—

“యూశావా? హాయిగావుంది. అన్నయ్యపిల్లలుకూడా వున్నప్పుడు, కొట్లాటలు అవి తప్పేవికావు. ఆ రోజుల్లో ఎంత అవస్థపడ్డాం? తల్చుకుంటే ఒళ్లుజలదరిస్తుంది.”

“పోనీలేస్తురూ. తల్చుకోవడ మెందుకు? పక్షవాళ్లు ఎప్పుడూ చెడ్డవారు కారు. మనకిప్పుడు కలి గిన కొరత ఏమిటి?......వెనకటి దినములు జ్ఞాపకంచేసికోనే వద్దు”.......అన్నది పుష్పలత కోమలంగా.